నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR



### బావి పూడిక తీస్తున్నం

పంటల సాగు చేసినంక నీళ్లస్త లేవు. ఎండిపోయే పరిస్థితి వచ్చింది. మా బావి ఎత్తిపోయేటట్టు ఉన్నది. అందుకే పూడిక తీస్తున్నం. మా ఊరిల చాలా మంది పరిస్థితి ఇట్లనే ఉన్నది. గతంలో ఫుల్లు నీళ్లస్తుండే. ఏ బావిల చూసినా మీదికే నీళ్లుంటుండే. పది, పన్నెండు గజాల బావులే ఎకరాలకు ఎకరాలు పారిస్తుండే. ఇప్పుడు రెండేండ్ల నుంచి అనుకుంట. బావులు ఎండి పోతున్నయి. నీళ్లు లేకుంటే పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. అందుకే బావిల పూడిక తీయిస్తున్నం. సైడ్ బోర్లు కూడా ఏయించినం. ఇప్పుడన్నా నీళ్లు సరిపోతయో లేదో చూడాలె. ఈ పక్క రైతులందరూ బావుల్ల పూడిక తీయించుకుంటున్నరు. బావుల అడుగు తవ్వించుకుంటున్నరు. కాలువల నీళ్లు ఫుల్లుగా వస్తే మాకు ఈ కష్టాలు ఉండేటివి కాదు.

**- దూడం నిఖిల్ (చామన్‌పల్లి)**



చామన్‌పల్లిలో ఎండిన మక్క కర్రలను మేస్తున్న మేకలు

### 11ఆర్ ద్వారా సరిపడా నీళ్లు ఇవ్వాలి



పెద్దపల్లి జిల్లాకు వెళ్లే డీ-87 నుంచి మాకు నీళ్లు వచ్చే 11ఆర్ కాలువ ఉన్నది. గతంల ఈ కాలువ ద్వారా నీళ్లచ్చేవి. మా ఊరు సస్యశ్యామలం అయ్యేది. గత రెండు సీజన్ల నుంచి నీళ్లస్త లేవు. పెద్దపల్లికే ఎక్కువ నీళ్లు తీసుకుంటున్నరు. కాలువ పరిస్థితి కూడా మంచిగ లేదు. వెదురుగట్టు పెద్దమ్మ గుడికాడ కొంచెం ఎత్తుంటది. కాలువకు పూర్తి స్థాయిలో నీళ్లు ఇస్తేనే మా రాజసముద్రం చెరువులకు పుష్కలంగా నీళ్లస్తయి. ఇప్పుడు సగానికి తక్కువనే నీళ్లస్తన్నయి. ఆ ఎత్తుగడ్డకాడనే మర్రగమ్ముతున్నయి. ఇగ నీళ్లెట్లస్తయి? రాజసముద్రం కింద 300 ఎకరాలు ఉంటది. దాని మీద సుతం ఈ కాలువ నీళ్లే ఆధారం. అక్కడొక వందెకరాల వరకు ఉంటది. ఇంత ఆయకట్టుకు నీళ్లు సరిపోవాల్నంటే కాలువ సామర్థ్యం మేరకు వదలాలే. కానీ, ఎవరు పట్టించుకుంట లేరు. ఎస్సారెస్పీ అధికారులను అడిగితే మొత్తం నీళ్లు ఇస్తున్నమని చెబుతున్నరు. మరి నీళ్లెక్కడికి పోతున్నయి? మా ఊళ్లె పంటలు ఎట్ల ఎండుతున్నయి?

**- తాళ్లపల్లి ఎల్లాగౌడ్, చామన్‌పల్లి**

### కొత్త బోరు వేసినా దక్కని పంట

నీరులేక ఎండిపోయిన పొలంలో దీనంగా కూర్చున్న ఈ యువ రైతు పేరు బోగొండ రాజు. కరీంనగర్ రూరల్ మండలం చామన్‌పల్లి. ఆయనకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. రెండేళ్ల కిందటి వరకు నిరందిగా ఎవుసం చేసిన రాజుకు, నిరుటి యాసంగి నుంచే సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. తన వ్యవసాయ బావికి గతంలో 5 హెచ్‌పీ మోటర్‌తో నాలుగు గంటలు నడిపించినా నీళ్లు తగ్గేవి కాదు. ఇప్పుడు భూగర్భ జలాలు అడుగంటడంతో అరగంట కూడా నడవడం లేదు. గతంలో మూడెకరాల్లో పొలం, ఒక్క ఎకరంలో మక్క పంటలు సాగు చేసినా పదేళ్లలో ఏ ఒక్కరోజూ నీటి సమస్య రాలేదు. కానీ, ఇప్పుడు మూడెకరాల్లో మక్క, ఎకరంలో వరి పంటను దక్కించుకునే పరిస్థితి లేదు. గతంలో కాలువల ద్వారా పుష్కలంగా నీళ్లు రావడంతో భూగర్భ జలాలు భారీగా పెరిగి రాజు బావి నిండుకుండలా ఉండేది. ఇప్పుడు అడుగంటి పోయింది. నెల కింద 2 లక్షల రూపాయలు ఖర్చు చేసి వేసిన బోరు నుంచి సరిగ్గా నీరు అందడం లేదు. ఫలితంగా మక్క, పొలం ఎండిపోతున్నాయి. పెట్టుబడి మీద పడిందని రాజు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. ఇది ఒక్క రాజు పరిస్థితే కాదు, ఆయన చుట్టుపక్కల ఎవుసం చేస్తున్న రైతులందరి పరిస్థితి ఇలాగే ఉన్నది.



▲ చామన్‌పల్లిలో ఎండిపోయిన పొలంలో కూర్చున్న రాజు

# వేసవికి ముందే సాగునీటి గోస

## ఉమ్మడి జిల్లాలో మొదలైన కష్టాలు

- బోరుమంటున్న బావులు.. పారని కాలువలు
- అడుగంటుతున్న చెరువులు, కుంటలు
- కొత్త బోర్లు తవ్వుకుంటున్న రైతులు
- ముమ్మరంగా బావుల్లో పూడిక తీతలు
- అయినా నీరందని పరిస్థితులు
- మాడిపోతున్న వరి, మక్క పంటలు
- పశువులకే వదిలేస్తున్న వైనం
- కాలువల ద్వారా నీళ్లిస్తేనే చేతికి పంటలు

**వేసవికి ముందే ఎవుసానికి కష్టకాలం మొదలైంది. మళ్లీ పదేళ్ల కిందటి పరిస్థితి కనిపిస్తున్నది. ఏడాదిన్నర కిందటి వరకు మండుటెండల్లోనూ వాటర్‌హబ్‌ను తలపించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు నేల నెర్రెలు బారుతున్నది. బావుల్లో నీళ్లు లేక.. కాలువల్లో పారక సాగునీటి గోస తీవ్రమవుతున్నది. యాసంగి పంటలు ఎండిపోతుండగా, అన్నదాత గుండె చెరువవుతున్నది. మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలో ఎదురైన కష్టాలు పునరావృతమవుతుండగా, చేను, చెలకలను తడిపేందుకు భగీరథ ప్రయత్నమే చేయాల్సిన దుస్థితి వచ్చింది. మడి మడికి పైపులు వేసుకోవడం, అడుగంటిన బావుల్లో పూడిక తీయడం, సైడ్, కొత్త బోర్లు వేయించుకోవడం వంటి నాటి కాఠిన్య పరిస్థితులు పోయిన యాసంగి నుంచే కండ్లముందు కదలాడుతున్నాయి. కాళేశ్వరం జలాలతో నట్టెండల్లో మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటలు ఇప్పుడు వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి. కాలువ ద్వారా సరిపడా నీళ్లిస్తేనే పంటలు చేతికొచ్చే పరిస్థితులు ఉన్నాయి.**

కరీంనగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ రూరల్: రెండేళ్ల కిందటి వరకు వాటర్ హబ్‌గా వెలుగొందిన కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నీటి యాజమాన్యం సరిగ్గా లేక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే అనేక మండలాల్లో పంటలు ఎండిపోయాయి. తోటపల్లి రిజర్వాయర్ ద్వారా సైదాపూర్, చిగురుమామిడి మండలాలకు నీరందక వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇటు గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో ర్యాలపల్లి, నారాయణపూర్ గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీరందక కరీంనగర్ మండలం గోపాల్‌పూర్, దుర్శేడ్, చేగుర్తి, మొగ్దుంపూర్, చామన్‌పల్లి తదితర గ్రామాల్లో కూడా పంటలు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయి. ఈ యేడాది కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యే సంకేతాలు వస్తున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కరీంనగర్ రూరల్ మండలం చామన్‌పల్లిలో రైతులు పడుతున్న కష్టాలు యాసంగి సీజన్‌కు ముందే హెచ్చరిస్తున్నాయి. ఈ గ్రామానికి వెదురు గట్టు మీదుగా పెద్దపల్లి జిల్లాకు వెళ్లే డీ-87కు 11ఆర్ కాలువ ఉన్నది. ఇక్కడి నుంచి చామన్‌పల్లి రాజసముద్రం చెరువులోకి ఎస్సారెస్పీ నీళ్లు రావాల్సి ఉంటుంది. గతంలో కాలువ నిండుగా వచ్చిన కారణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెరువు ఏటా నిండేది. ఇప్పుడు తక్కువ నీరు వస్తున్నదని, చెరువు నిండకపోగా ఉన్న నీళ్లు పంటలకు వాడుకుంటే నీటి మట్టం తగ్గుతున్నదని రైతులు చెబుతున్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎక్కువ నీటిని తీసుకెళ్తూ, 11ఆర్‌కు తక్కువ నీటిని వదులుతున్నారని వాపోతున్నారు. చెరువు కింద పంటలు వేసి నెల రోజులే అవుతున్నదని, ఇంకా రెండు, రెండున్నర నెలలు సాగునీరు అందించాల్సి ఉంటుందని, చెరువులో నీళ్లు చూస్తే ఇంకో నెలకు కూడా సరిపోవని ఆందోళన చెందుతున్నారు. 11ఆర్ ద్వారా నీటి విడుదలను పెంచితే తప్పా తమ చెరువు నిండే పరిస్థితి లేదని చెబుతున్నారు.

### ఆన్ ఆఫ్‌లో రెండు రోజులే నీళ్లు

ఎస్సారెస్పీ పరిధిలో నీళ్లను ఆన్ ఆఫ్ పద్ధతిలో ఎనిమిది రోజులు విడుదల చేసి మరో ఏడు రోజులు నిలిపివేస్తున్నారు. ఈ ఎనిమిది రోజుల్లో 11ఆర్ కాలువకు రెండ్రోజులే మహా అయితే మరో రోజు మాత్రమే నీళ్లు వస్తున్నాయని చామన్‌పల్లి రైతులు వాపోతున్నారు. మళ్లీ నీళ్లు రావడానికి పది పన్నెండు రోజులు పడుతున్నదని, అప్పటి వరకు పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని రాజసముద్రం చెరువుపై భాగంలో ఉన్న రైతుల పరిస్థితి పూర్తిగా అధ్వానంగా మారింది. అందరికీ ఎనిమిది రోజుల పాటు వచ్చే నీళ్లు వీళ్లకు మాత్రం పది పన్నెండు రోజులకు రెండు మూడు రోజులు మాత్రమే వస్తుండడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా రైతులు సాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన కష్టాలన్నీ ఇప్పుడు ఈ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్నారు. కాలువ ద్వారా నీళ్లు వచ్చినపుడు బావులు, బోర్లలో పుష్కలంగా నీళ్లు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేక పోవడంతో అవి అడుగంటి పోతున్నాయి. వేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు బావుల్లో పూడికలు తీసుకుంటున్నారు. సైడు, నిలువు బోర్లు వేయిస్తున్నారు. కొత్త బోర్లు తవ్విస్తున్నారు. ఇప్పుడు పదుల సంఖ్యలో రైతులు ఇదే పనిలో నిమగ్నమై కనిపిస్తున్నారు. చామన్‌పల్లిలోని రాజసముద్రం పై భాగంలో ఎక్కడ చూసినా క్రెయిన్లు, బోరు బండ్ల మోతలే వినిపిస్తున్నాయి. వేలకు వేలు, లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి ఇంత కష్టపడుతున్నా.. వేసిన పంటలకు సరిపడా నీళ్లందక పంటలు మాడిపోతున్నాయి.



చామన్‌పల్లిలోని రైతు దూడం శ్రీనివాస్ బావిలో పూడిక తీస్తున్న కూలీలు

### ఎండలు ముదిరితే మరింత నష్టం

కేసీఆర్ ప్రభుత్వంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో జల వనరులు పుష్కలంగా ఉండేవి. ఏ చెరువు చూసినా నిండుగా కళకళలాడేవి. మండుటెండల్లోనూ మత్తళ్లు దుంకుతూ కనిపించేవి. పచ్చని పంటలు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం వేసవి సమీపించక ముందే యాసంగి పంటలు మాడి పోతున్నాయి. కనీసం ఇంకా రెండు నెలలైనా పంటలకు నీటి తడులు అవసరం ఉంటాయి. కానీ, ఈ పరిస్థితి గట్టెక్కేదిఎలాగని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూర్తిగా వేసవి రాక ముందే పంటలకు దిక్కు లేకుండాపోయిందని, ఎండలు ముదిరితే వందలాది ఎకరాల్లో పంటలు ఎండక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్ మండలం చామన్‌పల్లి, మొగ్దుంపూర్, నల్లగుంటపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రామన్నపేట, దేవునిమిట్ల, ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి, సిరికొండ, పెద్ద లింగాపూర్, ఒగులాపూర్ తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇక గంగాధర మండలం నారాయణపూర్, మిడ్‌మానేరు పరిధిలోని తోటపల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని అందిస్తున్న గన్నేరువరం, చిగురుమామిడి, సైదాపూర్, తిమ్మాపూర్ తదితర మండలాల్లో కొద్ది రోజుల్లోనే సాగునీటి కష్టాలు ఎదురయ్యే పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి కాలువల ద్వారా సరిపడా నీళ్లు ఇవ్వాలని, చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ప్రత్యక్ష ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

### పెట్టుబడి వచ్చేదెలా..?



చామన్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు బోగొండ లక్ష్మిది మరో దీన గాథ. నిరుటి నుంచే కాలువ నీళ్లపై ఆశలు వదులుకున్న ఆమె, ఈ సారి యాసంగిలో తన మూడున్నర ఎకరాల్లో మక్కసాగు చేసింది. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టింది. నాలుగైదు సార్లు వేలాది రూపాయల విలువైన మందులు వేసింది. కానీ, నీళ్లు లేక కండ్లముందే పంట ఎండిపోతుంటే కన్నీటి పర్యంతమవుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీళ్లు వస్తాయని ఆశించిన లక్ష్మికి ఈ సారి నిరుడి కంటే కఠినమైన పరిస్థితులు ఎదురయ్యాయి. 11ఆర్ కాలువ ద్వారా నీళ్లు రాకుంటే బావిలో ఉన్న కొద్దిపాటి నీళ్లలో మక్కను కాపాడుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేసింది. బావి నుంచి మడి మడికి ప్లాస్టిక్ పైప్ వేసుకుని నీళ్లు పారించే ప్రయత్నం చేసింది. కానీ, ఒక పక్క తడుపుతుంటే ఇంకో పక్క ఎండుతూ వచ్చింది. ఇప్పుడు లక్ష్మి మక్కచేనుపై ఆశలు వదులుకున్నది. పీచు దశలో ఎండిపోయిన పంటను చూసి కన్నీళ్లు పెట్టుకోవడం మినహా చేసేదేమి లేక నిస్సహాయ స్థితిలో పడింది. కాలువ ద్వారా సరిపడా నీళ్లు వస్తే తన మక్క పంట పండేదని, ఎటూ సరిపోని నీళ్లు ఇస్తున్నారని, అందుకే పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. లక్ష రూపాయాల పెట్టుబడి మీద పడిందని వాపోతున్నది.

## బీసీలను వంచించింది కాంగ్రెస్సే

- బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ధ్వజం
- గోదావరిఖనిలో బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో బీసీలను వంచించింది కాంగ్రెస్ పార్టేనని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలను అణగదొక్కేందుకే కులగణన సర్వేలో తగ్గించి చూపారని మండిపడ్డారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కోరుకంటి చందర్ అధ్యక్షతన బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులగణన సర్వేలో ఐదున్నరశాతం బీసీల జనాభాను తగ్గించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహించారు. కులగణనపై వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం మళ్లీ సర్వే చేపడుతున్నదని విమర్శించారు. బీసీలకు 42శాతం విద్య, ఉద్యోగ రాజకీయాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ వర్గాలకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు, ఆదాయపు పన్ను మినహాయింపు చేయాలని, ఏబీసీ మంత్రిత్వశాఖను కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేకశాఖ ఏర్పాటు చేయాలని, కార్యనిర్వాహక న్యాయ శాఖల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, రాజ్యాంగ సవరణ చేసి 50శాతం నిబంధన ఎత్తివేయాలని బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు.

## సమ్మె విచ్ఛినానికి కుట్ర

- ఆర్టీసీ జేఏసీ రీజినల్ చైర్మన్ ఎంపీ రెడ్డి



కరీంనగర్ ఆర్టీసీ డిపో-2 ఎదుట సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రీజినల్ చైర్మన్ ఎంపీ రెడ్డి, నాయకులు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి14: ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను విచ్ఛినం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నుతున్నదని ఆర్టీసీ జేఏసీ రీజినల్ చైర్మన్ ఎంపీ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 14నెలలు పూర్తయిందని.. ఇంకెప్పుడు 3వేల ఉద్యోగాలు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఎలక్ట్రికల్ అద్దె బస్సులను రద్దు చేయాలన్నారు. ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని వన్, టూ డిపోల ఎదుట శుక్రవారం సమ్మె డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొమురయ్య, కో కన్వీనర్లు పుల్లయ్య, ప్రకాశ్ పాల్గొన్నారు.

## 'గ్రీన్ ఇండియా చాలెంజ్'ను సక్సెస్ చేద్దాం

- బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, ఫిబ్రవరి 14: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా చేపట్టే గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని తన స్వగృహంలో వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, మహోత్తర కార్యక్రమమైన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మూడు మొక్కలు నాటాలని కోరారు. నాటిన మొక్కతో సెల్ఫీ దిగి పంపాలన్నారు. ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, మాజీ కౌన్సిలర్లు శేఖర్, విజయ్, మహేశ్, మాజీ సర్పంచ్ మల్లేశం, నాయకులు ఈర్లపల్లి రాజు, క్రాంతి, శంకర్, కృపాల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ▲ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

## బీసీలను మోసం చేస్తే ఊరుకోం

- కులగణనపై ప్రభుత్వానివి అన్నీ కాకి లెక్కలే
- కావాలనే జనాభాను తగ్గించి చూపింది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో అన్నీ కాకి లెక్కలే ఉన్నాయని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం చెబుతున్న అంకెలు, రాష్ట్ర జనాభా వివరాలు ఏ లెక్కలతో పోల్చినా సరిపోవడం లేదని, మళ్లీ రీ సర్వే చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కరీంనగరంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 75 ఏండ్లుగా బీసీలను మోసం చేస్తూ వెనక్కి నెడుతూనే ఉన్నారని మండిపడ్డారు. అన్ని రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇప్పటివరకు ఆ అవకాశం దక్కలేదన్నారు. బీసీల ఆర్థిక సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి, వారికి రిజర్వేషన్ల ఫలాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2021లోనే వకుళాభరణం కృష్ణమోహన్ చైర్మన్‌గా బీసీ కమిషన్‌ను ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. సదరు కమిషన్ విస్తృతంగా అధ్యయనం చేసిందని, కానీ కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో కొంత ఆలస్యమైందని చెప్పారు. కేసీఆర్ నియమించిన కమిషన్ తన పూర్తి అధ్యయనం నివేదికను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారడంతో కులగణన జరుగలేదన్నారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన చేయాలని తాము అసెంబ్లీలోనూ డిమాండ్ చేశామని, అదే జరిగితే తాము స్వాగతిస్తామన్నారు. బిహార్‌లో శాస్త్రీయంగా కులగణన చేయక పోవడం వల్లే అక్కడి సర్వేను హైకోర్టు కొట్టివేసిందని, కర్ణాటకలోనూ ఇదే జరిగిందని చెప్పారు. గత మార్చిలో నిరంజన్ చైర్మన్‌గా బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ సర్కారు ప్రకటించిందని, అది జరిగిన ఏడు నెలలకు ప్లానింగ్ బోర్డు ద్వారా కులగణన చేస్తున్నట్టు జీవో నంబర్ 18 జారీ చేసిందన్నారు. ఆ సమయంలో డెడికేటేడ్ కమిటీ ఇచ్చిన సూచనలను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అసెంబ్లీ ఆమోదించిన జీవో ప్రకారం ఏర్పాటైన బీసీ కమిషన్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. శాస్త్రీయంగా కులగణన చేయకుండా అసెంబ్లీని మోసం చేశారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం సర్వే జరిగితేనే న్యాయ స్థానాల్లో నిలబడుతుందన్నారు. ప్రభుత్వం అలా చేయకుండా సర్వేలో పాల్గొనని వారి నుంచి మాత్రమే వివరాలు సేకరిస్తామంటూ ప్రభుత్వం మరోసారి తప్పటడుగులు వేస్తున్నదని మండిపడ్డారు. సర్వేలో ఏమైనా తప్పులు దొర్లాయా? అన్న వివరాలు తెలియాలంటే ముందుగా సర్వే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమగ్రమైన సర్వే జరగాలంటే కులగణన రీసర్వే చేయాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ఇస్తామని చెప్పిన రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ తీసుకునే చర్యలకు తాము కూడా మద్దతు ఇస్తామని వివరించారు. అవసరమైతే కేంద్రం వద్దకు వెళ్తామన్నారు. కానీ, బీసీ జాతిని మరోసారి మోసం చేయాలని చూస్తే సహించేది లేదని, బీసీలకు న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు బండారి వేణు, నాంపెల్లి శ్రీనివాస్, కచ్చు రవి, గుగ్గిళ్ల జయశ్రీ, మర్రి భవన, ఐలేందర్, శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### రీ సర్వే చేయాలి

2011 కేంద్ర జనాభా లెక్కల ప్రకారం చూస్తే రాష్ట్రంలో 3.50 కోట్ల జనాభా ఉన్నది. అలాగే ప్రతి పదేండ్లకోసారి తెలంగాణలో 13.8 శాతం రేషియో చొప్పున జనాభా పెరిగే అవకాశముందని ఆనాడే కేంద్రం చెప్పింది. ఆ లెక్కన చూస్తే ప్రస్తుతం రాష్ట్రంలో 4.25 కోట్ల జనాభా ఉండాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే సర్వేలో జనాభా లెక్కలు తగ్గించి చూపింది. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసింది. అవమానించింది. ఇప్పటికైనా జరిగిన తప్పులను గుర్తించి రీ సర్వేచేయాలి. కొంత సమయం తీసుకున్నా సరే గానీ శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేయాలి.

**- గంగుల కమలాకర్**